# పుణ్యలోకం

పుష్కరాలకెళ్తే, పుణ్యలోకాల ద్వారాలు తెరుచు కుంటాయి. మరి మన మౌఢ్యం మితిమీరితే ?

—జయప్రద

పార్థ సారథి ఈజీ ఛెయిర్‌లో పడుకుని జంతికలు తింటూ పేపరు చదువుకుంటున్నాడు.

"అయ్యబాబోయ్"

"ఏవిటయిందీ" జంతికలు పిండి నింపిన జంతికల ఫ్రేమ్ చేతిలో పట్టుకుని అలాగే పరుగెట్టుకొచ్చింది సత్యవతి ఆయన శ్రీమతి.

"ఇది చూడు !"

"ఏవిటి?" పేపరులో ఆమెకేమీ కన్పించలేదు.

"ఆ ఫోటో చూడు మొద్దూ!"

అది ఈనాడు పత్రికలో మొదటి పేజీలో పెద్ద ఫోటో. కృష్ణా పుష్కరాల ఫోటో. కృష్ణవేణిని చుట్టుముట్టిన ఆ జన సందోహం భయం కరంగా వుందది. ఇసుకవేస్తే అది నిజంగా భూమిమీద రాలేట్టులేదు.

కొన్ని లక్షల యాత్రికులు కృష్ణవేణినది జలాల్లో పుణ్యస్నానం ఆచరిస్తున్న కమనీయమయిన దృశ్యం. ఆ దృశ్యం పదేళ్ళ పేదపిల్లా డిని కోమటి అంగట్లో బెల్లంముక్క ఊరించినట్టు ఊరిస్తోంది సత్య వతిని. ఆమెకు పుష్కరాలకు వెళ్ళాలని మహా కోరిగ్గా వుంది. పోయిన గోదావరి పుష్కరాలకు భర్త ఒప్పుకోలేదు. ఈ సారన్నా వెళ్ళాలి.

పుష్కరాలు మొదలై అప్పుడే ఆరురోజులయిపోయింది. ఈ ఆరు రోజులనుంచీ సత్యవతి రిహార్సల్స్ వేసుకుంటూనే వుంది.

ఎప్పుడడిగితే బాగుంటుందో, ఎలా అడిగితే బాగుంటుందో అని. పైగా పక్కింటివాళ్ళు అప్పుడే వెళ్ళిపోయారు కూడానూ.

అలాటి సత్యవతి ఇలాటి మంచి అవకాశాన్ని వదలదల్చుకో లేదు.

"ఆదేవిటండీ అలా అంటారు? చీమలు దోమలు అని....ఎంత పుణ్యాత్ములు కాకపోతే అంత అదృష్టం వాళ్ళకు పట్టిందీ."

"ఏయ్ నువ్వు తప్పు చెపుతున్నావ్. వాళ్ళు పుణ్యాత్ములు కాబట్టి అక్కడ చేరలేదోయ్. ఇదిగో ఇప్పుడు వెళ్ళారుగా. ఇక పుణ్యాత్ములై పోతారు"

అతని వేళాకోళం ఆమె కర్థమవుతూనే వుంది. అయినా ఆమె తన ఆశకు ఊపిరి పోసుకుంటూ అడిగింది.

"మనమెప్పుడెళదామండీ"

అదిరిపడ్డాడు పార్థసారధి.

"మనమా? అక్కడకా నీకు పిచ్చిపట్టిందా ఏమిటి?" భర్త దగ్గర ఏ విషయాన్నైనా ప్రస్తావించేదాకా భార్యలకు జంకు. ఆ తర్వాత

వాళ్ళంత మొండి మనుషులు మరెవ్వరూ వుండరు. వాళ్ళకంటే మొండి మొగుళ్ళు వుంటే అది వేరే సంగతి.

"ఆహా ఈసారి తీసుకెళ్ళాల్సిందే. పోయినసారి మీమాట నేను విన్నాను. ఈసారి మీరు నామాట వినాల్సిందే."

"ఆగాగు. కారణం మార్చు నీమాటే వింటాను. కారణం అదే వుంచి మరో పుష్కరాలొచ్చాయి నామాట వినాల్సిందే అంటే అదెలా కుదురుతుంది?"

సత్యవతి అలిగిన సూచనగా మౌనం వహించింది.

"మనలో మన మాట. మనమెప్పుడయినా అలా కాంట్రాక్ట్ రాసుకున్నామా? ఒకసారి నీమాట నేను, ఒకసారి నామాట నువ్వు వినాలి అని...."

"ఆ అంత అదృష్టం కూడానూ" సాగదీసింది సత్యవతి.

"నీ అదృష్టానికేమొచ్చిందోయ్ ఇపుడు? మొగుడు కాలేజీ లెక్చరూ పిల్లలు ముత్యాలు....ఇదిగో వెళ్ళిపోకు ఇంకాసిన్ని జంతికలు పట్రా"

* * * *

అంతటితో ఆ యుద్ధకాండ ముగిసిందని అనుకున్న పార్థసారధి రాత్రి మరలా శ్రీమతి తన గుండెలమీద పడుకొని ఆదే ప్రసక్తి తేవడంతో హతాసుడైపోయాడు.

"ఏవండీ పన్నెండు సంవత్సరాలకొకసారి వచ్చే పుష్కరాలు మీకు చూడాలనిపించడంలేదూ?"

"లేదు. పన్నెండు సంవత్సరాలకొకసారా? ఖలేదానివే-పెళ్ళి ముహూర్తాలలాగే మనం ఎపుడు కావాలంటే అప్పుడు పెట్టేసుకోవచ్చు పుష్కరాలు.....

పోయిన సంవత్సరం గోదావరి పుష్కరాలు, ఈ సంవత్సరం కృష్ణ, వచ్చే సంవత్సరం పెన్న, ఆపై సంవత్సరం స్వర్ణముఖి...."

"చాల్లెండి మీది మరీ అఘాయిత్యం?"

"అఘాయిత్యమా! ఇది అబద్ధమా చెప్పు....పోయిన సంవత్సరం గోదావరి పుష్కరాలు రాలేదూ?"

"అది గోదావరి గదండీ!"

"ఓహో! అయితే వచ్చే సంవత్సరం పెన్న పుష్కరాలకెళదాం లెద్దూ?"

"మీరెప్పుడూ ఇంతే" అతన్ని తోసేసి అటు తిరిగి పడుకుంది సత్యవతి.

ఈరోజు తనకి భార్యతో తగువులాడాలని లేదు.

అసలెప్పుడూ అతనికి భార్యమనసు కష్టపెట్టాలని వుండదు.

"చూడు సత్యా!" పిలిచాడు పార్థసారథి.

ఆమె పలకలేదు.

ఆమె మీద చెయ్యివేసి ఇటు తిప్పుకున్నాడు.

"నిదానంగా ఆలోచించుకుని అలాగే వెళదాంగానీ...."

ఆమె ముఖం వెలిగిపోయింది.

రేపటినుండి స్వర్గ ద్వారాలు తమ కొరకు బార్లాతీసి పెట్టినట్టుగా సంబరపడిపోయింది.

"ఇంతకీ అక్కడికెళ్ళి మనం ఏం చేయాలట?"

"ఏం చేసేదేవిటండీ ఆ పుణ్యజలాల్లో మునిగీ...."

"నేను కూడా మునగాల్నా ఎంత మురికి అంటుకుంటుందో? ఆఁఆ! అలక్కూమరి! ఓకే! అలాగే మునుగుతామనుకో మనకేం వస్తుంది" అన్నాడు.

"పుణ్యమండీ"

"పుణ్యమా? ఏమో సత్యా! పుణ్యం వస్తుందో రాదో అనుమానం గానీ జబ్బులు మాత్రం వస్తాయోయ్"

"అదిగో మరలా?"

"ఓకే! ఓకే! మరి ఈ పిల్లకూనల్ని ఏంచేసి పోదాం? బామ్మకిచ్చి వెళదామా? దిగులుపడతావేమో సత్యా!"

"బామ్మకిచ్చి పోవడమేమిటండీ? అంత పుణ్యస్థలానికి వెళుతూ పిల్లల్ని వదిలేసి పోతామా? అయినా అమ్మమ్మగార్కి మాత్రం పుణ్య స్నానాలు చేయాలని వుండదూ?"

"అవునవును ఎందుకుండదూ? అసలే పుణ్యలోకాలకు ఆమె ప్రయాణం దగ్గరలోనే వుందాయే"

భర్త వేళాకోళానికి అలిగి సమావేశాన్ని రసాభాస చేసుకోవాలని లేదు సత్యవతికి.

అందుకే ఈసారి అలగలేదు.

"అయితే ఎపుడెళదామండీ?"

"ఉండుమరీ ఇంకా చాలా పాయింట్లున్నాయి. పిల్లలిద్దరూ, నువ్వూ, నేనూ, బామ్మా. మనకి కారు కూడా లేదాయే. అమ్మో ఈ సీజన్‌లో రైళ్ళు, బస్సులు తపస్సు చేసినా సీటు దొరకదు"

పకపక నవ్వింది సత్యవతి.

ఆ తర్వాత నవ్వడం ఆపేసి గంభీరంగా చెప్పింది.

"బస్సులు, రైళ్ళు ఎందుకండీ? మీకు ఏ శ్రమా కలగనివ్వను చూడండీ"

"అయితే ఎలా తీసుకెళతావ్? పాదాలకు పూసుకునే మందేమైనా వుందా నీ దగ్గర.

వుంటే చూడు చూడు అపుడు పుష్కరాలేవిటి అమెరికాయే చూసేసి సాయంత్రానికి వచ్చేద్దాం"

ఈసారీ భర్త పరాచకానికి ఉడుక్కోలేదు సత్యవతి.

"టూరిస్టు బస్‌లు ఎన్నేసారో మీకు తెలుసా? మన ఊరినుండే ఎన్ని బయల్దేరుతున్నాయనీ?"

"అహఁ అన్నీ తెలిసి పెట్టుకున్నావన్నమాట....టిక్కెట్ కూడా రిజర్వ్ చేసేసావా?"

"మీరు చెపితే చేస్తాను" చాలా తగ్గుస్వరంలో భర్త మాటకెదురు చెప్పనిదానిలా అణుకువగా అంది సత్యవతి.

అలా హఠాత్‌గా టాపిక్ రిజర్వేషన్‌లోకి వచ్చిపడడంతో కాస్త తత్తరపడ్డాడు.

అతనికి ప్రయాణం బొత్తిగా ఇష్టంలేదు.

ఖర్చు సంగతి వదిలేసినా ఇలాంటపుడు అక్కడికెళ్ళడం అందులో పిల్లల్తో ఎన్ని ప్రాబ్లెమ్స్?

"చూడండి మీకెలాటి శ్రమా ఇవ్వను. ఆఖరికి మా పెట్టెలుకూడ మేమే మోసుకుంటాం కాదనకండి"

భార్యమీద జాలేసింది పార్థసారధికి.

కానీ ఇందుకు అతని మనసు పూర్తిగా వ్యతిరేకంగా వుంది.

"అలాగే చూద్దాంలే పడుకో" అని భార్యను దగ్గరకు తీసుకొని కళ్ళుమూసుకున్నాడు.

* * * *

శనివారం కాలేజీనుండి వస్తున్న పార్థసారధికి చాలా హుషారుగా ఎదురుపడింది సత్యవతి.

"రేపు ఆదివారం మీకు శెలవు. నేనన్నీ సర్దేసాను. అమ్మమ్మకు కూడా చెప్పేసాను. నాకింతవరకు తోచనేలేదు. రేపు తప్పిస్తే మరలా మీకు సెలవు దొరకదు.

మీరొచ్చాక మిమ్మల్నడిగి సీతత్తా వాళ్ళకి చెపుతానని చెప్పాను. వాళ్ళెళ్ళే టూరిస్టు బస్‌లో ఖాళీలున్నాయట. ఈరాత్రికెళ్ళి సోమవారాని కొచ్చేస్తుందట" ఒక్కముక్కలో చెప్పేసింది శ్రీమతి.

పార్థసారధికి మతిపోయింది.

ఎలాగో నచ్చచెప్పి ఒప్పిద్దామకుకుంటున్న సారధిని హాలులో పరచబడ్డ సామాను నిరుత్సాహ పరిచేసింది.

అయినా ఆఖరి ప్రయత్నంగా....

"మొదట కాస్త స్నానానికి నీళ్ళు పెట్టావంటే ఆ తర్వాత డాబా మీదికెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు.

గంతులువేస్తూ వెళ్ళింది శ్రీమతి సత్యవతి.

"బామ్మా నువ్వయినా చెప్పకూడదూ? ఈ ఎండల్లో పిల్లల్నేసు కుని పుష్కరాలకెళతానంటోంది నీ మనవరాలు. ఏమైనా బావుందా ఇది చెప్పు"

"ఆదేవిటిరా పార్థూ? ఎండలెప్పుడూ వుండేవే. పుష్కరాలు మర్లా మర్లా రమ్మంటే వస్తాయా?"

హతాశుడై పోయాడు.

అయినా తనకి బుద్ధిలేదు. వెళ్ళి వెళ్ళి బామ్మకి చెప్పుకోవడం ఏమిటి?"

* * * *

"సత్యా మనం కృష్ణానదిని చాలాసార్లు చూశాం కదూ! నువ్వు ఒకసారి అందులో స్నానం కూడా చేశావు కదూ!"

డాబామీద చాప పర్చుకుని దిండుకానుకుని కూర్చుంటూ తన ప్రక్కనే కూర్చున్న భార్యతో అన్నాడు.

'అవునూ! అయితే' అన్నట్టు కాస్త ముఖం చిట్లించిందామె. "కృష్ణ మనకి క్రొత్త స్థలం కాదు. పైగా ఒకసారి నువ్వు మునిగావు కూడాను. మరలా ఇప్పుడెందుకు సత్యా"

ముడిపడ్డ ఆమె నొసలు మరలా విశాలమైనాయి.

"అదేవిటండీ? దానికీ, దీనికి ఏవిటి సంబంధం? ఇప్పుడు ఎన్నో నదులు వచ్చి అందులో కలుస్తాయట."

"ఎన్ని నదులు?"

"ఎన్నో ఒకన్ని"

"ఎన్నో నీకు తెలీదు. ఎవరో ఆ విషయం నీకు చెప్పారు. నువ్వు దాన్ని నమ్మావు. బాగా ఆలోచించు సత్యా నదిలో మునిగితే మన పాపాలు పోవడమేమిటి? పుణ్యం రావడం ఏమిటి?"

సత్యవతి మాట్లాడలేదు.

"చూడూ! అసలీ పద్ధతులన్నీ ఎందుకు పెట్టారంటే ఆ రోజుల్లో ఆడవాళ్ళను ఎక్కడికీ పంపేవారు కారట. ఇప్పటిలా వాళ్ళకి సినిమా అని, షాపింగ్ అని, పిక్‌నిక్‌లనీ, ఫంక్షన్స్ అనీ అలాటివేమీ లేవుగా అందుకని దేవుడి పేరు మీద తిరునాళ్ళనీ, పుష్కరాలనీ ఇలాటివి పెట్టి ఆడవాళ్ళను వంటిళ్ళనే ఊబిలోనుండి బయటకు లాగారు.

అంతవరకు అవి ఆనాటికి మంచి ఆచారమే కానీ ఈరోజు నువ్వెక్కడకెళ్ళాలన్నా పర్స్ అంగీకరిస్తే నేను తీసికెళతాను. మీరు బయట కెళ్ళకూడదనే సంకుచితత్వం మాలో తగ్గిపోయింది కానీ, ఇప్పుడు

కూడా ఆ పాతనమ్మకాన్ని మూర్ఖంగా నమ్మడం చాలా విచారకరమైన విషయం సత్యా"

ఆమె మాట్లాడలేదు. అసహనం ఆమెలో చాలా స్పష్టంగా కన్పిస్తోంది. అతని మాటల్లో సత్యాన్ని గ్రహించాలనే ఉద్దేశమే ఆమెకున్నట్టు లేదు. తన కోపానికి చిహ్నంగా కాస్త దూరంగా జరిగింది.

"మనం నమ్మే ఏ ఆచారమైనా, మనకీ మన వాళ్ళకీ సుఖాన్ని సంతోషాన్ని, కాస్త ప్రయోజనాన్ని ఇవ్వాలి గానీ చూస్తూ చూస్తూ తెలిసి తెలిసీ అక్కడికెళ్ళి ఆ మురికినీట్లో మునగడం ఎందుకు చెప్పు."

"ఇన్ని ఉపన్యాసాలెందుకు? నాకిష్టం లేదు వెళ్ళడానికి అని నిన్ననే ఒక్కమాట చెప్పుంటే నాకింత శ్రమ కలిగేది కాదుగా" ఆమె కళ్ళు నిండుకున్న సూచనగా ఆమె కంఠం రుద్ధమయింది. ఆమె లేచి నిల్చుంది.

"ఆగు వెళ్ళకు సత్యా. ఓ అరగంట ఆలోచించుకో మొదట. ఆ తర్వాత వెళ్ళాలనిపిస్తే నాకు చెప్పక్కరలేదు. నా పర్సులో డబ్బుంది తీసుకెళ్ళి టూరిస్ట్ బస్‌లో టిక్కెట్లు రిజర్వ్‌చేసి వచ్చి నాకు చెప్పు."

ఆమె కళ్ళు మెరిసాయి. సంతోషంగా వెళ్ళిపోయింది. ఉషారుగా వెళ్ళిన సత్యవతి వడలిపోయిన తోటకూర కాడలా వచ్చింది.

"టిక్కెట్లయిపోయాయి. అరగంట క్రితమే ఫుల్ అయిపోయిందట." ఇంచుమించు ఏడుస్తూ చెప్పింది.

"అయితే మన ప్రోగ్రామ్ కాన్సిల్ అయినట్టేనా?" అంటూ ప్యాంట్ విప్పి లుంగీ కట్టుకోను స్టాండ్‌వైపు నడిచాడతను.

"రైలుకెళదాం" కాస్త భయపడ్తున్నట్టుగా అంది. అతనికి తెలుసు ప్రారంభంలో ఆమె భయపడ్తున్నట్టే వుంటుంది. తను కాదన్న తర్వాత ఆమె అలుగుతుంది ఎలా అయినా ఈ ప్రయాణం తనకి తప్పదు. పైగా ఎప్పుడూ ఇలా మొండికేయదు ఆమె. ఎంత కోరికుందో మన

సుతో! 'ఆమె కోర్కె తీరని' అనుకుని "సరే" అన్నాడు. లేడిలా గెంతింది అంత నీరసమూ ఎక్కడికెగిరి పోయిందో మరో అరగంట కల్లా పిల్లల్ని తయారుచేసి తను తయారయిపోయింది.

అన్నం కూరలు టేబుల్‌మీద సర్దేసింది.

"పదకొండు గంటలు దాటితేగానీ మనకు ట్రయిన్స్ లేవులే. పిల్లల్ని కాసేపు నిద్రపోనీ" అన్నాడతను అన్నం తింటూ. నిరాశ పడబోయి మరలా సర్దుకుంది. పదకొండు గంటల కెళ్ళినా, ఉదయానికల్లా కృష్ణమ్మ పాదాల చెంత ఉండొచ్చు.

రైల్వే ప్లాట్‌ఫారం కనుచూపు మేరలో కొచ్చేసరికి కళ్ళు తిరిగి పోయాయి. ఇక్కడా ఇసక రాలేట్టులేదు. అంతవరకు ఓ వందరూపాయలు లంచం పెట్టయినా రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లో బెర్తు సంపాయించి కాసేపు పడుకోవాలి. అని కలలు కంటున్న అతను కనీసం కంపార్ట్‌మెంట్‌లో పుట్‌బోర్డ్ మీద కాకుండా నిలబడడానికయినా చోటు దొరికితే చాలనుకున్నాడిప్పుడు.

అర్థరాత్రి ఆరుగంటల ప్రయాణం నిల్చునే పూర్తి చేస్తున్నారు. బాత్‌రూమ్ తలుపు కడ్డంగా తను ఆరోగ్య సూత్రాల ప్రకారం పెంచుతున్న పిల్లలు పడుకోనున్నారు ఆ మురికిలో, దుర్గంధంలో. నిట్టూర్చాడు పార్థసారథి.

ట్రెయిన్ నదిని సమీపించే సరికి టైమ్ ఐదు గంటలుకూడా అయ్యుండదు.

అప్పుడే జనం. ఇసుకకాస్త తెచ్చుకున్నా బావుండేది. రైల్లోనుండి చల్లినా నేలమీద పడ్తుందో లేదో ఖచ్చితంగా తెలిసిపోయేది.

'శ్రీమతీ! అదిగో అక్కడ నువ్వు స్నానం 'చేయాల్సింది' తమాషాకి ఊహించి వేలు చూపాడు. అతను వేలు చూపిన మార్గంగుండా చూడడానికి సత్యవతికి చాలా టైమ్ పట్టింది. కంపార్ట్‌మెంట్ కిటికీ అత

నికి మధ్య ఓ గజందూరమే ఉన్నా అందులో పది తలకాయలయినా అడ్డంగా వున్నాయి.

ఆ దృశ్యాన్ని చూసిన అతని శ్రీమతి ముఖం తేజోవంతమైంది. బామ్మయితే సరాసరి స్వర్గాని కొచ్చాననుకుంది.

అప్పుడే ఏమయిందిలే అని మనసులో అనుకుని పైకి ఆనంద పడ్డట్టే నటించాడు పార్థసారథి. ఎలానూ వ్రతం చెడింది. ఫలితాన్ని ఎందుకు చెడుపుకోవాలీ.

రైలునుండి దిగి "పిల్లల్ని మర్చిపోతారు. జాగ్రత్త" అంటు న్నాడు సారథి సామాను అందుకుంటూ.

"మరీ విడ్డూరం" అని చిలిపిగా నవ్వింది సత్యవతి. ఆమెకు చాలా సంతోషంగా ఉందిప్పుడు.

వాళ్ళు ప్లాట్‌పారం మీద నడవడంలేదు. వెనకవాళ్ళు నెట్టడంలో ఈ కొస కొచ్చేశారు.

"నిజానికి నేనీ సామాను మన ఒప్పందం ప్రకారం మోయ కూడదు" అన్నాడు. చేతిలోనే ఎయిర్ బ్యాగ్‌ని తాటాకుల బుట్టని రాజీ కుదిర్చే ప్రయత్నం చేస్తూ, మనోహరంగా నవ్వేస్తూ ఆ ట్రాఫిక్‌ని దాటే సింది అతని అర్ధాంగి.

"టిక్కెట్లు తీయండీ" అని హెచ్చరించింది.

"టిక్కెట్లు కొన్నామా?"

"భలేవారే—నేనేగా ఆడాళ్ళ క్యూలో కెళ్ళి తెచ్చి మీ చేతికిచ్చింది."

"మర్చిపోయాలే. అయినా నేనయితే కొనుండను. ఎలాగూ మన పాపాలు ఈరోజుతోటితో పటా పంచలవబోతుండగా ఇది ఆఖరి పాపంగా చేసేసుందును."

"కౌనరూ? అదిగో మీ మొగుడక్కడున్నాడు. మీ కాలరు పట్టు కుంటాడు."అతనితో పాటూ ప్రవాహంలో ఈదుతూ అతనితో సరసా లాడుతోంది సత్యవతి.

"నా కాలరు పట్టుకుంటాడా? ఎంత ధైర్యం వాడికి. ఇంతకష్టాలు పడి కృష్ణవేణీ మాత ఒడిలో కొస్తున్న నన్ను...."

"అవేం మాటలండీ" నొచ్చుకుందామె.

"ఓహో అలా అనకూడదూ? ఓకే ఓకే."

"ఇప్పుడెక్కడికెళ్ళాలి?"

"టిఫిన్ నాన్నా" కోరస్.

"కానీ, మొదట గూడు మాటేవిటిరా?"

"వాళ్ళకేం తిండిబోతువెధవలు చెపుతుంటారులెండి. పదండి దగ్గ రలో ఏదయినా హోటల్లో వీటిని పడేసి స్నానం చేసి...."

"బామ్మా! నీ మరచెంబు జాగ్రత్త. పిల్లలు ఒకటికో రెంటికో అండే మరలా కష్టం."

"మరీ అమాయిత్యమండీ మీది. హోటల్స్‌లో మగ్స్ వుండవా ఏమిటీ."

"హోటల్సా-ఎంతాశ-పదపద- ఏదయినా చెట్టు ఖాళీ వుంటే చూడు కంబళీ పరిచేద్దాం."

"ఈయనకన్నీ వేళాకోళాలే" ఈసారి నిజంగానే విసుక్కుంది.

అతను నోరుమూసుకున్నాడు.

ఓ రెండుగంటలు బామ్మా ఇద్దరు పిల్లలు మరచెంబు, తాటాకుల బుట్ట ఒకరిక్షాలో శ్రీమతి పార్థసారథి ఎయిర్‌బ్యాగ్ మరో రిక్షాలో

శరధంలా కదిలి విజయవాడంతా ఓ చుట్టు చుట్టేసాక సత్యవతే నోరు విప్పింది.

"ఇదేమన్యాయమండి ఆఖరుకి రిక్షావాళ్ళ హోటల్స్‌లో కూడా దొరకలేదు"

"రిక్షావాళ్ళ హోటల్స్ అని తీసిపారేయకు. ఇందాకిలాటి హోటల్లో ఓ సినిమా యాక్టర్‌ని చూశాను నేను-పుణ్యమంటే మాటలా పైగా ఆదివారం ఈరోజు"

"మరెలాగండీ" నీరసంగా కూలబడింది సత్యవతి.

"మీరు స్నానం చేసేయండి తిరిగి వెళ్ళిపోదాం" ఆనందంగా సలహా ఇచ్చాడు పార్థు.

"అదెలా కుదురుతుందీ? కనకదుర్గమ్మను చూడాలి ఈమధ్య వెంకటేశ్వరస్వామి కోవెలకూడా ఏదో కట్టారని విన్నాను. ఆయన్నీ దర్శించుకోకుండా ఎలా వెళదాం?"

"అలాగే-అలాగే. అన్నీ తిరగేసి సాయంత్రానికొచ్చేయ్ చాలు, ఆ సామాన్లు వేసుకుని అదిగో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ని బ్రతిమలాడి ఆ షెడ్ క్రింద కూర్చొనుంటాను పిల్లల్తో"

"అంటే మీరు స్నానం చేయరూ" చాలా కొత్త విషయాన్ని విన్నట్టు ఆశ్చర్యపోయింది సత్యవతి.

అతని గుండెల్లో దడ ప్రారంభమైంది.

"ప్లీజ్ సత్యా! నన్నొదిలెయ్! తలమీద నీళ్ళు చల్లుకున్నా చాలట. ఆ మరచెంబుతో సువ్వా బామ్మా కాస్త నీళ్ళుతెచ్చి మామీద చల్లేద్దురూ"

"అదేం కుదరదు-మీరూ స్నానం చేయాల్సిందే"

"అయితే మరి సామానూ?"

అతనికి మంచి కారణం దొరికింది.

"మొదట నది దగ్గరకెళదాం తర్వాత ఎవరయినా పరిచయం కాకపోతారా? లేకపోతే పాతముఖాలు కనబడకపోతాయా? వాళ్ళకప్పజెప్పి స్నానం చేసొద్దాం"

"హతోస్మి"

* * * *

"నీకేం కావాలిరా బుజ్జీ? మసాల దోశయితే ఆలస్యమైపోతుంది. ఈసారి కితప్పం తినేయ్. అక్కడ ఆలస్యం కాకుండా ఎవరికి ఏం కావాలో ఇప్పుడే అనుకోండి. వెళ్ళగానే ఆర్డరిచ్చి తొందరగా బయట పడతాం మనకు గూడులేదు! ఈరోజు రాత్రికే వెళ్ళిపోవాలి" అన్నాడు పార్థు టాక్సీలో కూర్చుంటూ.

ఈసారి రిక్షాలుగాని, ఆటోలుగాని దొరకలేదు.

లారీ దొరికినా దాంట్లో కూర్చోవాల్సిందే.

లేకపోతే గంటలు గడవాల్సిందేగాని మనకు కావాలనుకున్న వాహనం దొరకదు.

టాక్సీ ఓ పెద్ద కాస్ట్లీ హోటల్ ముందాగింది. అలాటి చోటుకి తీసుకెళ్ళమనే చెప్పాడు.

రష్ వుండదని కాని క్యూ రోడ్‌లోకుంది.

"సత్యా! మన విజయవాడ హఠాత్తుగా జాంబే అయిపోయినట్టు వుంది తిండికి క్యూనే"

"తిండీవద్దు పాడు వద్దు పదండి ఇక్కడే తెల్లారేట్టుంది" అని వెనక్కి తిరిగింది బామ్మ మరచెంబుతోసహా.

"ఊఁ మాక్కావాలి" మరలా కోరస్ టిక్కెట్ కొనను క్యూలో నించున్నాడు పార్థసారథి.

అతని శ్రీమతి సహవాన్ని కొనుక్కొని తన ఇద్దరి సుపుత్రులకూ తాము కృష్ణ తిరునాళ్ళలో కొనుక్కోబోయే మిటాయిలు బెలూన్‌లు అక్కడుండే రంగుల రాట్నాల గురించి చెప్పి వాళ్ళను హోటల్‌నుండి తిరోన్ముఖుల్ని చేయడానికి ప్రయత్నిస్తోంది.

అతనికి టిక్కెట్ అందే టైము వచ్చేసరికి సుపుత్రులు వాళ్ళమ్మ మాటను మన్నించి సరే అన్నట్టున్నారు.

"వద్దు వచ్చేయండి పిల్లలొప్పుకున్నారు" అనరిచింది వీధిలో నుంచి.

మామూలుగా అయితే ఆలా అరిచినందుకు అతనికి పెద్దకోపం వచ్చుండేది.

కానీ ఇది స్వంత వూరు కాదుకనక వూరుకున్నాడు.

"టిక్కెట్లు తెస్తున్నానులే" అని తిరిగి అరిచాడు.

సత్య తన వేలుతో మరొకవేపు చూపించింది.

అక్కడ టిక్కెట్లు పట్టుకుని సీట్లకొరకు క్యూలో నిల్చొని వున్నారు.

ఉసూరుమంటూ బయటకొచ్చాడు పార్థు.

అతనికి ఆకలిగానే వుంది.

* * * *

స్పీడుగా వెళుతున్న ఆటో ఠక్కున ఆగింది.

పోస్టాఫీస్ కూడలి దగ్గర మనుషులతో రోడ్డు నిండిపోయింది.

వాహనాలు వెళ్ళను స్థలంలేదు.

మధ్యలో రిక్షావాళ్ళకి-జనాలకి తగూలు-

పోలీసుల లాఠీ చార్జీలు.

"వెనక్కెళ్ళి చుట్టు తిప్పుకుని వెళ్ళమనండి-వాళ్ళుగాని వచ్చి మీద పడతారో ఏమిటో" అంది సన్నగా సత్యవతి.

"ఊర్కో ఇప్పటికే మామూలుకన్నా రెండింతలడిగారు. చుట్టూ తిప్పి తీసికెళితే నా పర్స్ ఖాళీ అయిపోతుంది"

అరగంట....

గంట గడిచిపోయింది.

రోడ్డుమీద జనవాహిని.

"ఆకలి—ఆకలి" కోరస్.

"ఒంటేలికి" చిన్నోడు అరున్నొక్క రాగం.

"నేను ఇక్కడికెళ్ళాలి" పెద్దోడు దాచకుండా రెండేళ్ళు చూపిస్తున్నాడు.

ఆ వేళ్ళు ముడిచేసి కోపంగా చూశాడు పార్ధసారధి.

వాడు వూరుకున్నాడుగానీ చిన్నోడు వూరుకోలేదు.

"నాకు మిఠాయిస్తానన్నావు" గునుస్తున్నాడు వాళ్ళమ్మని.

"మీనాన్న ముందుగా ఏమయినా తేల్చి చెప్పారా మన ప్రయాణము గురించి. ఏదయినా తినను చేసి తెద్దామంటే" అని భర్తవైపు చురచుర చూసింది.

అక్కడికేదో హటాత్తుగా అతను వాళ్ళను తొందరచేసి ప్రయాణము కట్టించినట్టు.

వాహనం కదిలింది.

"ఎక్కడికి తీసుకెళ్ళమంటారండీ? ఏ ఘట్టంలో స్నానం చేస్తారూ?" అడిగాడు వాడు.

తెల్లముఖం పెట్టింది సత్యవతి.

"అదే ఏ ఘట్టంలో లంటే–పుష్కర ఘాట్‌లోనా, బాలాజీ ఘాట్ లోనా, దుర్గ ఘాట్‌లోనా, బంగారు ఘాట్, కృష్ణవేణి ఘాట్స్, విజయా ఘాట్, తోట్లవల్లూరు ఘాట్ అదీ కాకపోతే రాణీగారి తోటలోని ఘాట్ అని చాలా ఘాట్‌లున్నాయి. దేంట్లో చెప్మా" అని అడుగుతున్నాడు డ్రయివర్.

"చెప్పు మరి" భార్యను తొందర చేసాడు పార్థసారథి.

భర్తకి ఈ పుష్కర ఘాట్ల గురించి అంత నాలెడ్జి వున్నందుకు గర్వపడి ఊరుకుంది సత్యవతి.

అతనికి పేపర్‌లో చూసిన పేర్లయినా గుర్తున్నాయి. ఆమెకదీ లేదు.

"పుష్కర ఘాట్‌లో అయితే నీళ్ళు అన్నిట్లోకంటే కాస్త నయముగా వున్నాయి" అన్నాడు డ్రయివర్.

"అంటే వాటి లాగానా?" అని ప్రక్కనే పారుతున్న మురికి కాలవని చూసి జోక్ విసిరాడు పార్థసారథి. డ్రయివర్ తక్కువ వాడిలా లేడు.

"లేదుసార్ అంతకంటే కాస్త మెరుగే" అని ఎదురుజోక్ విసిరాడు.

కృష్ణవేణీ నది పరిసర ప్రాంతాల దగ్గర ఆటో ఆగేక ఆ ప్రాంతాల్ని కొత్తగా చూశాడు పార్థసారథి.

"శ్రీమతీ! ఇది మనమిది వరకు చూసిన విజయవాడేనా?" అని ఆశ్చర్యపోయాడు.

నిజమే చాలా మారిపోయిందా ప్రదేశం. పుష్కరాల పేరున నదీమతల్లి చుట్టూ ఎక్కడికక్కడే ఘట్టాలు–స్నానాల గదులు అన్నిటి కంటే ఆశ్చర్యం మరో రెండు బ్రిడ్జిలు.

ఆటో అబ్బాయి వెళ్ళిపోయాడు. ఐదుగురూ నిరాశ్రయుల్లా చేతిలో వస్తువులతో నడివీధిలో నిల్చిపోయారు.

"మొదట ఈ పిల్లల నేచురల్ కాల్స్‌కి జవాబివ్వకపోతే వాళ్ళక్కడే అఘాయిత్యం చేసేలా ఉన్నారు." బాత్‌రూమ్‌ల వైపుగా నడిచాడు పిల్లలతో. ఆదివారం ఉదయం తొమ్మిదిగంటల వేళ అది. బాత్‌రూమ్‌ల దగ్గర బ్రహ్మాండమైన క్యూ–

"తప్పేదేం వుందీ! ఆ మరచెంబిలా ఇవ్వు బామ్మా" అని దాన్ని అందుకుని పిల్లల్ని భుజానికేసుకుని ఈదడం ప్రారంభించాడు జన వాహినిని.

కొద్దిదూరం ఈదాక చాలా కష్టంమీద తలతిప్పి "సత్యవతీ అక్కడే ఉండండి" అని కేకేసాడు.

* * * *

ఆఖరి ప్రయత్నంగా పిల్లల్ని వద్దులే సత్యా జలుబులు చేస్తాయి" అన్నాడు పిల్లలు బాత్‌రూమ్‌కెళ్ళొచ్చాక.

"ఇంతదూరం వచ్చి స్నానం చేయకుండా ఎలాండీ తొందరగా మునిగి తీసుకొచ్చేస్తాను" అని తనతో కదలకుండా అక్కడ కూర్చున్న భర్తవంక ఆశ్చర్యంగా చూసింది.

"మీరు స్నానం చేయరూ"

"అబ్బే! ఎందుకు చేయనూ? ఇంత కష్టపడి పుణ్యం సంపాదించు కుని వెళ్ళకపోతే ఎలా?" అని బుద్ధిగా అబద్ధమాడేసాడు.

"మరి ఈ సామానెలా?" అని నిరుత్సాహపడ్డట్టుగా నటించాడు. అతని ఉత్సాహం ఎంతో సేపు నిలవలేదు.

సత్యవతి సూయింగ్ క్లబ్బు పరిచయస్థురాలు కన్పించింది.

"అరే నువ్వా సత్యవతీ-నాకు తెలీనే లేదు నువ్వొస్తున్నట్టు" అంది బోల్డు సంబరపడుతూ.

ఇన్ని లక్షల జనాభాలో ఈమెకామె కనబడ్డమా? అని పార్థసారధి విసుక్కుంటే-

"మీరు స్నానం చేసినట్టున్నారు. కాస్త మా సామాను చూస్తూ ఉంటారా, మేము కూడా స్నానం చేసొస్తాం" అని నిస్సంకోచంగా అడిగేసింది సత్య.

"దానికేం? ఏవీ మీ సామాన్లు" అని పార్థసారధి చుట్టూచూసింది. కాస్తదూరాన వున్న మరచెంబువైపు చూస్తూ కంచుమరచెంబు మీదేనా?" అంది.

"అవునండి" అని బిక్కచచ్చిపోతూ చెప్పింది సత్యవతి. ఆ సామాను క్లబ్ మేట్ కి అప్పచెప్పి భర్తతో నాలుగడుగులు వేశాక మీకెన్ని సార్లు చెప్పాను-ఒక స్టీలు మరచెంబు కొనమనీ" అని అతన్ని కోప్ప డింది.

"స్టీలు మరచెంబేం ఖర్మోయ్ ఏకంగా బంగారుదే కొనుక్కుం దాం. కాస్త ఆగు మరీ...." అనేసి చటుక్కున వెనక్కి తిరిగి నిల్చి పోయిన భర్తను మోచేత్తో పొడిచింది సత్యవతి.

"అదేవిటి ఆగిపోయారు?"

"ఉండు నీ స్నేహితురాలు నిల్చున్న రేవుకి గుర్తులు చూసు కుంటున్నాను. మరలా వచ్చి మనం ఆమెను కలుసుకోవాలి" అంటూ అతను ఒక్కడుగేసి ఆగాడు.

"పుష్కరఘాట్‌లో ఆడవాళ్ళు చాలా మందున్నారు. నేను మరో ఘాట్‌లో చేస్తాను స్నానం మీరెళ్ళండి."

"సరే మేమెళుతున్నాం ఆ ఎయిర్ బ్యాగ్ ఇలా ఇవ్వండి" అని లాక్కుని, స్నానం చేయను బద్ధకిస్తారు కాబోలు-తప్పు అని మరొక్క సారి ప్రవాహం ఈదడం ప్రారంభించిన శ్రీమతిని జాలిగా చూస్తూ అక్కడే నిల్చుండిపోయాడు పార్థసారథి.

తన శ్రీమతి లాగే జనవాహినిని ఈదుతూ జలవావాహినిని చేరు తున్న కొన్ని వేలమందిని చూస్తూ మనదేశంలో ఇన్నిలక్షల మంది అమా యకులున్నారా?" అని ఆశ్చర్యపోయాడతను.

"పోనీలే ఇలాన్నా తృప్తిపడిపోతున్నారు" అని తను తృప్తి పడి ఊరుకున్నాడు. అతను నిల్చునదగ్గరనుండి చూస్తే స్నాన ఘట్టాలు కొన్ని కన్పిస్తున్నాయి. అన్నిటిలో కొద్ది కొద్దిగా నీరు, ఆ నీటిలోనే ఒకర్ని తోసుకుని ఒకరు స్నానాలు. ఇక్కడ సిగ్గు, బిడియం, సభ్యత, నాగరికత అన్నీ ఎగిరిపోతాయి. పుణ్యం కావాలి మరి.

జనాలకు కాస్తదూరంగా చుట్టూ తిరిగాడు పార్థసారథి. కృష్ణ ముఖద్వారం వద్ద కృష్ణవేణీమాత విగ్రహం- ఒక చేతిలో కలశంతో చాలా బాగుందది. కానీ దానికయిన ఖర్చు పేపర్‌లో చదివిన అంకె అదే నచ్చలేదతనికి. ఓ పదిమంది మధ్యతరగతి ఆడపిల్లలకు పెళ్ళిళ్ళవు తాయి శుభ్రంగా ఆ ఖర్చుతో.

ఎక్కడబడితే అక్కడ అంగళ్ళు వెలిశాయి. అన్నిటికీ ఇంచు మించుగా అవేపేర్లు కృష్ణవేణీమాత ప్లాస్టిక్ బొమ్మల అంగడి పుష్కర గాజుల అంగడి. పుష్కర ఫ్యాన్సీషాపు, కృష్ణవేణి సోడాషాప్, హోటల్ పుష్కర వగైరా వగైరా....

"పాపం పిల్లలుంటే ఇక్కడ ఏదయినా తనుకొనిస్తే బావుండేది. వాళ్ళమ్మను ఏం అల్లరి పెడుతున్నారో!" అనుకున్నాడు. ఆ తర్వాత ఆ విషయం మర్చిపోయి కాస్త జనంలోకి దూరి తమాషా చూడాలను కున్నాడు. తలబొప్పి కట్టేసింది.

"అదేవిటమ్మా-కాలు తొక్కేస్తున్నావు-కళ్ళు నెత్తికెక్కాయా?"

"తప్పుకోను స్థలం ఏదీ" అతను తప్పుకుని బయటకొచ్చేసరికి కొన్నివందల గాధలు.

"నీ పవిట కాస్త దోపుకోవమ్మా మురికి కంపు కొడుతోంది" ఎదుటి వ్యక్తిని నొప్పిస్తున్నానని ఎలాటి సంకోచమూ లేకుండా ఎలా మాట్లాడతారో! అతనికి చిత్రంగా వుంటుంది.

"కాస్త ఆగవమ్మా అలా మగాళ్ళని తోసుకుని పోకపోతే ఏం"

"అమ్మో! ఆగడమే పుణ్యలోకాల్లో రిజర్వేషన్స్ అయిపోవూ!" నవ్వుకున్నాడు పార్థసారధి.

ఇంట్లో పరాయి మగాడు అంతదూరంలో నిల్చునుంటే పవిట నిండుగా కప్పుకుని తలుపు చాటునుండే ఆడపిల్లలు వీళ్ళు.

* * * *

అలా కొట్టుకొచ్చిన అతను ఒక దగ్గర తేలాడు. చుట్టూ చూసు కున్నాడు. అది కృష్ణలంక హైస్కూల్.

దాన్ని పుష్కర నగరంగా మార్చినట్టున్నారు. అక్కడ కాస్త పళ్ళు తోముకుంటే బాగుండుననుకున్నాడు.

కానీ బ్రష్ తాటాకుల బుట్టలో వుండిపోయింది. ఈ రోజు ఈ పళ్ళమీద పాచికి విముక్తున్నట్టు లేదనుకుని మరలా బయలుదేరాడు.

అతను తిరిగి తన స్థలం కనుక్కొని వచ్చేసరికి శ్రీమతి బట్టలు మార్చు కుని పౌడరుకూడా అద్దేసి ముత్యంలా తయారయ్యింది. పిల్లలకు బట్టలు కూడా మార్చేసింది.

వచ్చీ రాగానే పెద్దాడు ఏడుస్తూ కంప్లయింట్ చేసాడు.

"నాన్నా! అమ్మ నన్ను నీళ్ళల్లో ముంచింది."

"వీడు ఒకటే గొడవ నాన్న కావాలని. మీరయితే ముంచరని కాబోలు" ఫిర్యాదు చేసింది శ్రీమతి.

"అవునూ! వాళ్ళకేమైనా పెట్టిస్తే బావుంటుందేమో-నువ్వు పళ్ళు తోముకున్నావా?"

"పళ్ళపొడి ఎక్కడిది పుక్కిలించి పూసాలెండి" అనేసి "అదేవిటి మీరు స్నానం చేసినట్టులేరూ!" అని అనుమానంగా చూసింది. మొదట కాస్త తత్తరపడ్డాడు పార్థు.

"ఎందుకు చేయలేదూ బట్టలు నీ దగ్గర వుండిపోయే. అలాగే మునిగేసి అలా నాలుగుసార్లు తిరగేసా. ఎండికూడా పోయుయి.

మానిపోయున్న మనవడి చొక్కా వంక అనుమానాస్పదంగా చూసింది బామ్మ.

"నిజమేనా? చేశావా? తీరా ఇక్కడకొచ్చి చేయకుండా వెళ్ళ కూడదురా పార్థూ!"

"అదేవిటి బామ్మా! నాకామాత్రం తెలీదూ ఇంత చదువు చది వానూ"

అని వినయం నటించాడు. తగువులు కొనితెచ్చుకోవటం అతనికి ఇష్టంలేని సంగతుల్లో మొదటిది.

"ఓ.కే. ఇక పనయిపోయింది. నేనలా వెళ్ళి బస్‌స్టాండ్‌లో బస్‌ల

వివరాలు కనుక్కొస్తాను. మీరు అలా ప్రకాశం బ్యారేజ్ దగ్గరకెళ్ళి, అక్కడ కృష్ణవేణి విగ్రహం ఉంది చూసేసి రండి బాగుంది" అని చెప్పి కదలబోయాడు. పెద్దాడు తండ్రి చేయి పట్టుకున్నాడు "నేనూ వస్తా నాన్నా" అంటూ.

"వుండరా వెధవా, కృష్ణమ్మతల్లి విగ్రహం చూడకుండా ఎక్కడికి పోతావ్" అని కసిరింది బామ్మ.

"వాడు వచ్చే పుష్కరాల కొస్తాడులే బామ్మా. అప్పుడు నువ్వుంటావో వుండవోగానీ" అనేసి వాడిని లాక్కుని బస్‌స్టాండ్ వైపుగా వెళ్ళబోయాడు. మధ్యలో చిత్రంగా మరో బస్‌స్టాండ్ భవానీపురంలో-టెంపరరీగా అ విషయం ఎవరో స్వచ్ఛంద సేవకుడు చెప్పాడు వాళ్ళు మాత్రం చాలా సేవలు చేస్తున్నారు జనాలకి.

హోటల్ పుష్కరలో కొడుకుతోసహా భోంచేసి ఇవతలపడ్డ పార్థసారథి కడుపులో వికారం.

"వరసగా బస్‌లున్నాయి. వెళ్ళిపోదాం" అంటూ ఆనందంగా తిరిగొచ్చిన భర్తను విసుగ్గా చూసింది సత్యవతి.

"ఏమా తొందర ఒక పుణ్యమూలేదు, ఒక పాపమూలేదు"

"పాపం కూడా లేదుకదా!" అని తృప్తిపడి, 'అయితే ఇంకా ఏం చేద్దామంటావ్' అన్నాడు. సత్యవతికి చిరాకెత్తి అలిగి ఊర్కుంది.

"అదేవిటీ ఆ కనకదుర్గమ్మను చూపించవా?" పాపం బామ్మ వాపోయింది.

"అవునవును. ఆ ఇంద్రకీల పర్వతం సంగతే మర్చిపోయాను. పదండి పదండి" అంటూ అటుగా వెళ్ళే ఆటోని కేకేసి వాడు నూటయాభై రూపాయలు అడిగితే యాభయ్ రూపాయలకి బేరం చేయబోయి ఆఖరికి ఇద్దరూ వందరూపాయల దగ్గర రాజీ పడ్డాక ఆటో ఎక్కారు. తాటాకుల బుట్టతోసహా.

"ఇది మిట్టమధ్యాహ్నం అయిపోయిందిగానీ సాయంత్రపు వేళలో అయితే ఈ రూట్ మనసుకు చాలా హాయిగా వుంటుంది అమ్మమ్మా" అంది శ్రీమతి.

ఆమెను విజయవాడకు చాలాసార్లు తీసుకొచ్చాడు పార్థసారథి.

ఆ కొండమీదనుండి క్రిందికి చూస్తే పరువంలో వున్న ఆడపిల్ల పరుగెత్తినట్టు ప్రవహించే కృష్ణ-ఆ దృశ్యం చాలా ఇష్టం అతనికి.

"హాయా? ఈరోజా! ఈ జనంలో!!...." ఆశ్చర్యం ప్రకటించాడు.

"జనం జనం అంటావేవిటిరా మాటిమాటికీ. జనం లేకపోతే ఏం బావుంటుంది."

"హేట్సాఫ్ బామ్మా నీ ఓపిక్కి హేట్సాఫ్"

★ ★ ★ ★

"టిక్కెట్టు కొనాలా? క్యూలో వెళదామా?" అడిగాడు పార్థసారథి. క్యూ అనేసరికి భయపడి పోయింది సత్యవతి. ప్రొద్దున లేచి అన్నీ క్యూలే-బాత్‌రూమ్ కెళ్ళను క్యూ, స్నానం చేయను క్యూ, టిఫిన్లకూ క్యూ....

"వద్దు టిక్కెట్టు కొనండి" అనేసింది అలిగిన సంగతి మర్చిపోయి.

"టిక్కెట్టు వద్దులే పుణ్యం తగ్గిపోతుందో ఏవిటో? క్యూలోనే వెళదాం."

కోపంగా చూసిందామె. అసలే నీరసంగా వుందామెకు.

"ఓకే. ఓకే బాస్ అలా చూడకు. నేనేమై పోతానో ఏవిటో ఇంత మంది జనంలో ఏదీ కుదర్దు."

పాపం పార్థసారధి ఇక్కడా అశాభంగం పొందాడు. టిక్కెట్టు ధర పెంచినా ఆనందంగా కొనుక్కొచ్చాడు. తొందరగా వెళ్ళిపోవచ్చు నని కానీ టిక్కెట్టు క్యూ కూడా చిన్నదేంకాదు. కాకపోతే పరుగు పందెం పెట్టించారంతే.

* * * *

"అమరావతిలో మునక్కుండానే వెళుతున్నాం" నిరాశ పడింది సత్యవతి.

"అదీ కృష్ణేగా. కాకపోతే జిల్లా మారింది. పుణ్యమంతా ఒకటేలే పదపద" తొందర చేసాడు భార్యను. అక్కడికి రమ్మని గొడవ చేస్తుం దని భయపడ్డాడతను.

"పిల్లలు ఎగ్జిబిషన్ భలే బావుంది" అని ఎవరో చెప్పింది విని గొడవ పెడితే "మనూరులో ఎలాగూ ఎగ్జిబిషన్ పెట్టారు అందులో జెయింట్ వీల్ కూడా వుంది." అని అబద్ధమాడేసి వాళ్ళను సమాధాన పరిచాడు.

బస్‌స్టాండ్‌లో, ఆ మురికిలో, ఆరుగంటలనుండి నిరీక్షణ. ఒక్క బస్‌లోనూ సీట్ లేదు. పిల్లలు బస్‌స్టాండ్‌లోనే నేలమీదపడి నిద్రపోతు న్నారు.

"ఇప్పటికి 11 మంది చనిపోయారట అమ్మా మన కృష్ణలో మునిగిపోయి" అన్నాడు పార్థసారధి బస్‌లో కూర్చుని స్థిమిత పడ్డాక.

"పుణ్యాత్ములు" అని జవాబిచ్చిందామె.

బస్‌గూడూరులో ఆగేవరకూ అందరూసొమ్మసిల్లి నిద్రపోయారు.

* * * *

"ఏడవకు ఏడవకుసత్యా!" తనకుతొలిసారిగా తండ్రిపదవినిచ్చిన

ఏడేళ్ళ ప్రియమైన పెద్దకొడుకు మృతదేహాన్ని మట్టిలో పూడ్చిపెట్టి తిరి గొచ్చి భార్యను ఓదారుస్తున్నాడు పార్థసారధి.

ఆమె కళ్ళెత్తి చూసింది. అవి చాలా దీనంగా వున్నాయి. గర్భిగా వున్నాయి. ఆ కళ్ళనిండా అప్పటికప్పుడే ఉబికిన నీళ్ళు.

"సత్యా!"

భర్త నంటుకుపోయి బావురుమందామె.

"నేనే. నేనే వాడిని చంపుకుంది. నాకు శిక్ష వేయండి. నాకు శిక్ష వేయండి" అతని ఛాతీమీద ఆమె తల అసహనంగా పొర్లుతోంది.

"సత్యా! కావాలని ఎవరూ కొడుకును పోగొట్టుకోరు. అలా జరగా లని వుండింది. ఇందులో ఎవరితప్పూ లేదు"

ఆమె విపరీతమైన ఆశ్చర్యంతో భర్తవైపు కళ్ళెత్తి చూసింది అతనేమంటున్నాడు?

అలా జరగాల్సి వుండింది జరిగింది. అంటున్నాడు. తను నమ్మని ఖర్మ సిద్ధాంతంతో తనను ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

"వచ్చే పుష్కరాలకి వాడొస్తాడులే బామ్మా అప్పటికి నువ్వుం టావో వుండవో గానీ.?

ముసలామె గుండెల్లో ఆ వాక్యాలు ప్రతిధ్వనిస్తున్నాయి.

"తను రాయిలా వుంది. పువ్వులాటి పసిబిడ్డ వెళ్ళిపోయాడు" ఆమె కళ్ళలో నీళ్ళు రావడంలేదు. గానీ ఆమె గుండెలు ఉడికిపోతు న్నాయి. తమ ఆనందం కొరకు వాడిని బలి ఇచ్చారు తామంతా.

"నేసి ప్రయాణం సంగతి ఎత్తకపోతే వాడు బ్రతికేవాడే" తలుచు కుని తల్చుకునీ ఏడుస్తోంది సత్యవతి.

"ఛీ....ఏమిటా పిచ్చితనం. మనం వెళ్ళకపోయినా వచ్చేదే. జబ్బులు ఎవరికి రావడంలేదు" అని భార్యను ఓదారుస్తూనే వున్నాడు. కానీ అతని అంతరాత్మ మాత్రం దానికి ఎదురు తిరుగుతూనే వుంది. పశ్చాత్తాపపడుతూనే వుంది.

తను గట్టిగా చెప్పుండాల్సింది. వెళ్ళడానికి లేదని. అలాటిచోట్ల ఇలాటి జబ్బులు వస్తాయని తెలీని అమాయకురాలు సత్య. తనకన్నీ తెలుసు. అయినా ఎక్కడికక్కడే రాజీ పడిపోవడంతో తను చేసిన ఘోరపాటిది.

ఆ రోజు ఇంటికి రాగానే విరేచనాలు పట్టుకున్నాయి. బస్‌లోనే జ్వరం. చూసుకోలేదు. ఒకరోజు ఇంట్లో వైద్యం అయ్యాక డాక్టరు దగ్గరకు తీసికెళితే ఆయన మరోరోజు నిర్దుమేటిక్ ట్రీట్‌మెంట్ ఇచ్చి ఏమి అనుమానం తోచిందో ఎక్స్‌రే తీసారు. నిమోనియా అని తేల్చారు. ఎన్ని మందులు, ఎన్ని సెలైన్ బాటిల్స్!! నిమోనియాకి తోడు కలరా కాటోలు. డాక్టర్ల పరిభాషలో అతిసారవ్యాధి. పేరు ఏదయితేనేం? తను ప్రియంగా తన కొడుక్కి పెట్టించిన భోజనం. వాడికందించిన బహుమానం ఇది.

పుణ్యం పేరుతో వద్దంటున్నా వినకుండా మూర్ఖంగా తన భార్య వాడిని నదిలో ముంచి వాడికందించిన ఉరితాడది.

అతనికి కళ్ళల్లో నీళ్ళు రావటంలేదు. గుండెల్లో భారం పశ్చాత్తాపం, బాధ, దిగులు.

పదకొండుమంది పుష్కరాల్లో చనిపోయారని తనంటే బామ్మ ఏమంది?

పుణ్యమంది. ఆమెకంతే తెలుసు. కానీ యాభయ్, అరవై లక్షల జనాభా ఆనందం కొరకు పదకొండో, పన్నెండో బ్రతుకులు పతి

సమాప్తమైపోయినా పర్వాలేదా? వాళ్ళ నల్లుకొన్న కొన్ని వందల బ్రతుకులు అశాంతి పాలయినా పర్వాలేదా?

పర్వాలేదు. పర్వాలేదు. కానీ ఎప్పుడు ఒక ప్రయోజనం కొరకు కొన్ని వేలమందో, కొన్ని లక్షలమందో బ్రతుకులు ఇంకా స్త సుఖమయం కావడం కొరకు అప్పుడు అప్పుడు పదకొండో, పన్నెండో ప్రాణాలు పోయినా పర్వాలేదు. వాటినల్లుకొన్న కొన్ని వందల బ్రతుకులు అశాంతి పాలైనా పర్వాలేదు.

కానీ ఇప్పుడు జరిగిందేవిటి? ఒక మూఢనమ్మకం, ఒక ఆచారం, ఒక పండగ. దాని కొరకు తన చిన్నారిబాబు ప్రాణం ఖర్చు అవ సరమా?

అతనికంతా చీకటై పోయింది. కళ్ళు తిరుగుతున్నట్లయింది.

❋